క్లుప్తంగా

కాలభైరవా.. కరుణించవా!



విశేష అలంకారంలో శ్రీ కాలభైరవస్వామి

కడప కల్చరల్: కడప నగరం మగ్దూం సాహెబ్ కొట్టాల గ్రామంలో శ్రీ కాలభైరవస్వామికి మంగళవారం విశేష పూజలు నిర్వహించారు. ప్రతి నెలలో వచ్చే భైరవాష్టమి నాడు ఈ విశేష పూజలు నిర్వహిస్తారు. ఈ సందర్భంగా సోమవారం ఉదయం స్వామి మూలమూర్తికి విశేష అభిషేకాలు, అనంతరం పూల అలంకారం చేశారు. అర్చకులు శ్రీధరశర్మ అష్టోత్తర శతనామావళి పఠించారు. బాసట స్వచ్ఛంద సేవా సంస్థ అధ్యక్షులు మేరువ బాలాజీరావు, బాసట సభ్యులు డీఏ కార్తీక్‌రెడ్డి, సురేంద్ర తదితరులు పాల్గొన్నారు.

పట్టుదలతో ఉద్యోగం సాధ్యం

కడప వైఎస్‌ఆర్ సర్కిల్: ఉద్యోగాల కోసం రాత పరీక్షలు రాసే అభ్యర్థులకు పట్టుదల ముఖ్యమని ఏఐవైఎఫ్ జిల్లా కార్యదర్శి గంగా సురేష్ పేర్కొన్నారు. సోమవారం నగరంలోని వెంకట సాయి కోచింగ్ సెంటర్‌లో ఏఐవైఎఫ్ ఆధ్వర్యంలో నిర్వహించిన ఎస్‌ఐ నమూనా పరీక్షకు విశేష స్పందన లభించింది. ఈ కార్యక్రమంలో ఏఐవైఎఫ్ నాయకులు చైతన్య, శివ నాగేంద్ర, నాగార్జున తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వ డిగ్రీ కళాశాల అధ్యాపకుల ప్రచారబాట

వైవీయూ : కడప నగరంలోని ప్రభుత్వ పురుషుల కళాశాల (ఆర్ట్స్ కళాశాల) అధ్యాపకులు కళాశాలలో ప్రవేశాల కోసం ప్రచారబాట పట్టారు. కళాశాలలో లభించే సౌకర్యాలు, వసతులు, అందించే కోర్సులకు సంబంధించిన సమాచారాన్ని కరపత్రాలుగా ముద్రించి వివిధ జూనియర్ కళాశాలల్లో ప్రచారం నిర్వహిస్తున్నారు. ఇందులో భాగంగా సోమవారం కడప నగరం ఎన్‌జీఓ కాలనీలోని నారాయణ జూనియర్ కళాశాలలో ఆర్ట్స్ కళాశాల అధ్యాపకులు విచ్చేసి విద్యార్థులకు డిగ్రీ విద్యపై అవగాహన కల్పించారు. అధ్యాపకులు డా. బుసిరెడ్డి సుధాకర్‌రెడ్డి, డా. సి. నాగేశ్వర్‌రెడ్డి డా. భూషణ్‌రెడ్డి, డా. టి. వెంకటేశ్వర్లు, డా. వి. శ్రీనీత, డా. లీలావర్ధిని, కె. శ్రీనివాసులు, ఎం. శ్రీనివాసులు, శంకర్‌రెడ్డి పాల్గొన్నారు.

శ్రీ రాజేశ్వరి ఆలయంలో శివరాత్రి పూజలు

కడప కల్చరల్ : మహాశివరాత్రి పర్వదినాన్ని పురస్కరించుకుని కడప నగరం మున్సిపల్ మైదానంలోని శ్రీ రాజరాజేశ్వరీ దేవి ఆలయంలో విశేష పూజోత్సవాలు నిర్వహించనున్నట్లు ఆలయ చైర్మన్ కొప్పరపు ఉమేష్ తెలిపారు. ఈనెల 17న ఉదయం 6.30 గంటలకు గణపతిపూజ, అంకురారోపణ, లింగతో భద్ర మండల అవాహన తదితర పూజలు ఉంటాయని తెలిపారు. 18న మహాశివరాత్రి నాడు ఉదయం 5.30 గంటల నుంచి మహాగణపతి, మహాలక్ష్మి, సరస్వతి, నవగ్రహ, రుద్ర హోమాలు నిర్వహించనున్నట్లు తెలిపారు. రాత్రి 7 నుంచి 9 గంటల వరకు శివపార్వతుల కల్యాణోత్సవాన్ని వైభవోపేతంగా నిర్వహిస్తామన్నారు. అదేరోజు రాత్రి లింగోద్భవ సమయంలో రుద్రాభిషేకం నిర్వహించనున్నట్లు వివరించారు.

అంగన్వాడీల సమస్యలను పరిష్కరించాలి

కడప వైఎస్‌ఆర్ సర్కిల్: జిల్లాలోని అంగన్వాడీల సమస్యలను వెంటనే పరిష్కరించాలని ఏపీ అంగన్వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ అసోసియేషన్ రాష్ట్ర గౌరవాధ్యక్షురాలు మంజుల పేర్కొన్నారు. సోమవారం నగరంలోని హోచిమిన్ భవన్‌లో ఏపీ అంగన్వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ జిల్లా ఆఫీస్ బేరర్స్ సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ అంగన్వాడీ కార్మికులకు కనీస వేతనాలు అమలు చేసి ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తించాలన్నారు. వీరికి ఫేస్ అంటెండెన్స్ యాప్‌ను రద్దు చేయాలన్నారు. ఏఐటియూసీ నాయకులు నాగ సుబ్బారెడ్డి, వేణుగోపాల్,విజయ, శ్రీదేవి, కాంతమ్మ పాల్గొన్నారు.

అప్పర్ భద్ర ప్రాజెక్టు నిర్మాణాన్ని ఆపాలి

కడప వైఎస్‌ఆర్ సర్కిల్: కర్ణాటక రాష్ట్రంలోని అప్పర్ భద్ర ప్రాజెక్టు నిర్మాణాన్ని ఆపాలని ఆర్‌సీపీ రాష్ట్ర కార్యదర్శి ఎస్.రవిశంకర్ రెడ్డి పేర్కొన్నారు. సోమవారం అప్పర్ భద్ర ప్రాజెక్టు నిర్మాణాన్ని ఆపాలని కోరుతూ అఖిల పక్ష పార్టీల ఆధ్వర్యంలో కలెక్టరేట్ ఎదుట నిరసన చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం అప్పర్ భద్ర ప్రాజెక్టు నిర్మాణాన్ని వెంటనే ఆపి రాయలసీమకు నీటి కేటాయింపులు చేయాలన్నారు. కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం కర్ణాటక ఎన్నికల్లో గెలవాలని రాజకీయ ప్రయోజనాల దృష్ట్యా అప్పర్ భద్ర ప్రాజెక్టుకు ఆగమేఘాల మీద జాతీయ ప్రాజెక్టుగా ప్రకటించడం ఏమిటని ప్రశ్నించారు. 17 డైరెక్టరేట్లు అనుమతి ఇవ్వాల్సిన ప్రాజెక్టుకు 17 నెలలో అనుమతి రావడం ఆశ్చర్యాన్నికి గురి చేస్తోందన్నారు. రాష్ట్ర ప్రభుత్వం కేంద్ర ప్రభుత్వం వైఖరికి నిరసగా సుప్రీం కోర్టుకు వెళ్లి అప్పర్ భద్ర ప్రాజెక్టును అడ్డుకోవాలన్నారు.

కల్యాణ వైభోగమే..



కల్యాణోత్సవాన్ని తిలకిస్తున్న భక్తులు



కల్యాణమూర్తులుగా స్వామి, అమ్మవార్లు

వైభవంగా శ్రీ భద్రావతి భావనారాయణస్వామి కల్యాణం

కడప కల్చరల్ : కడప నగరం సాయిపేటలోని శ్రీ భద్రావతి భావనా రుషి ఆలయంలో సోమవారం స్వామి, అమ్మవార్ల కల్యాణోత్సవాన్ని వైభవంగా నిర్వహించారు. ఆలయం 28వ వార్షికోత్సవాన్ని పురస్కరించుకుని ప్రధాన అర్చకులు టి.మధుశర్మ ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం నిర్వహించారు. అందులో భాగంగా మాఘ బహుళ సప్తమి స్వాతి నక్షత్రంలో కల్యాణోత్సవాన్ని కమనీయంగా చేపట్టారు. ఉదయం 5 గంటల నుంచి సుప్రభాతం, అభిషేకం, అర్చనలు తదితర పూజలు నిర్వహించారు. దీక్షా హోమాలు, మహా పూర్ణాహుతి చేసిననంతరం ఆలయం వద్ద ఏర్పాటు చేసిన కల్యాణ వేదికపై స్వామి, అమ్మవార్ల ఉత్సవ మూర్తులను వధూవరులుగా అలంకరించి కొలువుదీర్చారు. వేద పండితుల మంత్రోచ్చాటనలు, మంగళ వాయిద్యాలు, భక్తుల నామస్మరణల మధ్య కల్యాణ ఘట్టాన్ని కమనీయంగా నిర్వహించారు. అనంతరం భక్తులందరికీ అన్నదానం చేశారు. ఈ సందర్భంగా గ్రామోత్సవాన్ని వైభవంగా కోలాహలంగా నిర్వహించారు.

సమస్యల పరిష్కారంలో అలసత్వం వద్దు



ప్రజల నుంచి అర్జీలు స్వీకరిస్తున్న కమిషనర్

కడప కార్పొరేషన్: ప్రజా సమస్యల పరిష్కారంలో అలసత్వం వద్దని మున్సిపల్ కమిషనర్ ఎస్ఎస్ ప్రవీణ్‌చంద్ అన్నారు. సోమవారం స్థానిక కార్పొరేషన్ కార్యాలయంలో నిర్వహించిన స్పందన కార్యక్రమంలో ఆయన ప్రజల నుంచి అర్జీలు స్వీకరించారు. ఈ సందర్భంగా మొత్తం 52 అర్జీలు రాగా .. వాటిని సంబంధిత అధికారులకు ఇచ్చి నిర్దేశించిన సమయానికి పరిష్కరించాలని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో సీపీ సంజీవ్ కుమార్, డిప్యూటీ కమిషనర్ రమణారెడ్డి, ఈఈ నారాయణస్వామి, ఏసీపీ నాగేంద్ర, ఎంహెచ్‌ఓ ప్రశాంత్ వర్ధన్, డీఈలు కరిముల్లాఖాన్, వేణుగోపాల్, ఆర్‌ఓలు విజయ్‌భాస్కర్ గౌడ్, కన్నయ్య పాల్గొన్నారు.

పారిశుధ్య పనుల పరిశీలన

మార్నింగ్ విజిట్‌లో భాగంగా సోమవారం ఉదయం 17వ డివిజన్‌లో పర్యటించిన కమిషనర్ అక్కడ కార్మికుల మస్టర్ తనిఖీ చేసి, పారిశుధ్య, ఇంజినీరింగ్ పనులను పరిశీలించారు. 18వ వార్డులో గార్బేజ్ పాయింట్లు శుభ్రం చేయాలన్నారు. అంగడి వీధిలో గార్బేజ్ పాయింట్లు, కంపాక్టర్ బిన్‌లను తొలగిస్తూ ప్రజలకు చెత్తపై అవగాహన కల్పించాలన్నారు. క్లాప్ వాహనాలకు మాత్రమే చెత్త అందజేసేలా చర్యలు తీసుకోవాలని శానిటేషన్ సిబ్బందికి సూచించారు. చెత్త సేకరణలో జాప్యం ఉండకూడదని తెలిపారు. ఈ కార్యక్రమంలో వార్డు సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

భారత కోకిలకు ఘన నివాళి

వైవీయూ: కడప నగరంలోని ప్రభుత్వ పురుషుల కళాశాలలో భారత కోకిలగా పేరొందిన సరోజినీ నాయుడు జయంతిని ఘనంగా నిర్వహించారు. ప్రిన్సిపాల్ జి. రవీంద్రనాథ్, అధ్యాపకులు ఆమె చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రచయిత్రిగా, కవయిత్రిగా, సంస్కర్తగా సరోజినీనాయుడు జీవితం నేటికీ ఆదర్శప్రాయమన్నారు. వైస్ ప్రిన్సిపాల్ ఎం. రమేష్, అధ్యాపకులు విశ్వనాథ్, వెంకటలక్ష్మి, శివపార్వతి, శాంతిలత, నాగరాజు, రామకృష్ణ, రమ్యజ్యోతి, డా. శివరామకృష్ణ, డా. రాజీవ్‌బాబు తదితరులు పాల్గొన్నారు.

కడప ఎడ్యుకేషన్: స్వాతంత్ర సమరయోధురాలు సరోజినీ నాయుడు జయంతి సందర్భంగా సోమవారం జాతీయ మానవ హక్కుల న్యాయవాది షేక్ ఆమీర్ పీరా కార్యాలయంలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె చిత్రపటానికి పూలమాల వేసి నివాళులు అర్పించారు. హైకోర్టు న్యాయమూర్తి షేక్, రాయల్ కరీం సేవాసమితి అధ్యక్షులు రాయల్ కరీముల్లా, బద్వేల్ సంఘ మిత్ర సంస్థ అధ్యక్షులు పెంచలయ్య, యునైటెడ్ ముస్లిం ఫోరం ప్రధాన కార్యదర్శి రఫిక్, టీడీపీ సిటీ అధ్యక్షుడు కొండ సుబ్బయ్య, టీడీపీ బీసీ సెల్ ఉపాధ్యక్షులు దస్తగిరి తదితరులు కార్యక్రమంలో పాల్గొన్నారు.

స్థల వివాదం.. కేసు నమోదు

కడప అర్బన్/కార్పొరేషన్: కడప నగరంలోని టూటౌన్ పోలీస్‌స్టేషన్ పరిధిలో మోచంపేటలో రామకృష్ణ హైస్కూల్ వెనుక భాగాన స్థలంలో ప్రహరీ నిర్మిస్తున్న తనపై కొందరు దౌర్జన్యానికి పాల్పడ్డారని కాంట్రాక్టర్ నరసింహారెడ్డి పోలీసులకు ఫిర్యాదు చేశారు. కాంట్రాక్టర్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కడప టూటౌన్ ఎస్ఐ సంజీవరాయుడు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. సంఘటనా స్థలంలో ఎలాంటి ఉద్రిక్తతలకు తావులేకుండా పోలీసులు బందోబస్తు విధులను నిర్వహించారు.

అరెస్టు సరికాదు...

దర్గా స్థలం ఆక్రమణను అడ్డుకున్న అఖిలపక్ష నాయకులను అరెస్ట్ చేయడం దారుణమని, వారిని విడుదల చేయాలని వివిధ పార్టీల నాయకులు డిమాండ్ చేశారు. సోమవారం కార్పొరేషన్ కార్యాలయం ఎదుట ఉన్న గాంధీ విగ్రహం ఎదుట నిరసన తెలిపారు. భూ కబ్జాదారులకు పోలీసులు కొమ్ముకాయడం సరికాదన్నారు.

సాఫ్ట్ టెన్నిస్ చాంపియన్‌షిప్ పోటీల్లో ప్రతిభ



విద్యార్థులతో కళాశాల ఎండీ, ప్రధానాచార్యులు

కడప ఎడ్యుకేషన్: వైఎస్సార్ జిల్లా సాఫ్ట్ టెన్నిస్ అసోసియేషన్ వారి ఆధ్వర్యంలో ఈనెల 11,12 తేదీలలో కడప మున్సిపల్ గ్రౌండ్ క్రీడా మైదానంలో అంధ్రప్రదేశ్ రాష్ట్రస్థాయి సాఫ్ట్ టెన్నిస్ చాంపియన్‌షిప్ -2023 పోటీలలో కేఎస్‌ఆర్ఎం విద్యార్థులు ప్రతిభ చాటారు. తృతీయస్థానంలో నిలిచినట్లు ప్రధానాచార్యులు వీఎస్ఎస్‌మూర్తి తెలిపారు. ఈ సందర్భంగా కళాశాల మేనేజింగ్ డైరెక్టర్ డాక్టర్ కందుల చంద్ర ఓబుల్‌రెడ్డి విద్యార్థులను అభినందించారు. కళాశాల ఫిజికల్ డైరెక్టర్ వంశీనాయక్, నారాయణ పాల్గొన్నారు.

రక్తహీనత నివారించడమే ప్రభుత్వాల లక్ష్యం



ఐసీడీఎస్ సిబ్బందితో మాట్లాడుతున్న పరిశీలకుడు వెంకటేష్

కమలాపురం: గర్భవతులు, బాలింతల్లో రక్తహీనతను నివారించడమే కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల లక్ష్యం అని నీతి అయోగ్ పరమల్ ఫౌండేషన్ పరిశీలకుడు వెంకటేష్ అన్నారు. జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు సోమవారం కమలాపురం పట్టణంలోని 14వ వార్డు 4వ, 3వ అంగన్వాడీ కేంద్రాలను ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా కేంద్రాల్లో ఉన్న రికార్డులను, హాజరు పట్టికలను, గర్భవతులు, బాలింతల వివరాలను పరిశీలించారు. అలాగే సెంటర్‌కు వచ్చిన గర్భవతులు, బాలింతలతో వారికి అందుతున్న పౌష్టికాహారం, వైఎస్సార్ సంపూర్ణ పోషణ పంపిణీపై ఆరా తీశారు. అలాగే రోజు మధ్యాహ్నం సెంటర్లలోనే భోజనం తింటున్నారా? రుచికరంగా ఉందా? అనే వివరాలు అడిగి తెలుసుకున్నారు. ప్రతి రోజు కోడిగుడ్డు, పాలు ఇస్తున్నారా? అని చిన్నారులను అడిగి తెలుసుకున్నారు. అనంతరం ఆయన మాట్లాడుతూ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అంగన్వాడీల పనితీరు, అభివృద్ధిపై ప్రత్యేక దృష్టి సారించిందన్నారు. చిన్నారులు, గర్భవతులు, బాలింతలకు మంచి పౌష్టికాహారం అందిస్తున్నప్పటికి వారిలో రక్తహీనత చోటు చేసుకోవడం బాధాకరమన్నారు. రక్తహీనత పై మరింత అవగాహన కల్పించాల్సిన అవసరం ఎంతైనా ఉందన్నారు. చిన్నారుల అభివృద్ధికి అంగన్వాడీ కేంద్రాలు మూల స్తంభాలన్నారు. ఈ కార్యక్రమంలో సూపర్‌వైజర్లు మేరీ జయకుమారి, పార్వతి, వర్కర్లు సునీత, సురేఖ పాల్గొన్నారు.

క్రమశిక్షణతో మెలగాలి

చింతకొమ్మదిన్నె: మండలంలోని గ్రామాల్లోని ప్రజలు క్రమ శిక్షణతో మెలగాలని సికెదిన్నె ఎస్ఐ బి. అరుణ్‌రెడ్డి పేర్కొన్నారు. సోమవారం మండలంలో అల్లర్లు సృష్టిస్తున్న వ్యక్తులకు పరివర్తన కార్యక్రమం ద్వారా అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామాల్లో ఎవరైనా అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడితే కఠిన చర్యలు తప్పవన్నారు.

భక్తి శ్రద్ధలతో పంచముఖీ గాయత్రి యజ్ఞం



యజ్ఞాలు చేయిస్తున్న గురురాజారావు

కమలాపురం: స్థానిక స్వామి వివేకానంద హైస్కూల్ ప్రాంగణంలో శ్రీ పంచముఖి గాయత్రి యజ్ఞం భక్తి శ్రద్ధలతో నిర్వహించారు. గాయత్రి పరివార్-ఋషికేష్ వారి ఆధ్వర్యంలో గురురాజారావు, నాగపాటి రాజాగురూజీ పర్యవేక్షణలో పంచముఖ గాయత్రి యజ్ఞం ఘనంగా నిర్వహించారు. సమీప ప్రాంతాలకు చెందిన ప్రజలు పెద్ద ఎత్తున అక్కడికి చేరుకుని హోమాలు, యజ్ఞాలు, ప్రత్యేక పూజలు చేశారు. ప్రపంచ శాంతి కోసం ఈ యజ్ఞం చేసినట్లు నిర్వాహకులు తెలిపారు.

15న సమర్ధ రామదాస స్వామి ఆరాధనోత్సవం



ప్రత్యేక అలంకరణలో సద్గురు సమర్థ రామదాస స్వామి

ప్రొద్దుటూరు : మండలంలోని ఉప్పరపల్లె గ్రామంలోని శ్రీ సద్గురు సమర్థ నారాయణ స్వామి ఆశ్రమంలోని గోశాలలో ఈనెల 15న బుధవారం సద్గురు సమర్థ రామదాస స్వామి (ఛత్రపతి శివాజీ గురువు) ఆరాధనోత్సవం నిర్వహించనున్నట్లు అర్చకుడు నాగేంద్ర స్వామి తెలిపారు. ఉదయం అభిషేకం, అర్చనలు, ప్రత్యేక పూజలు చేసి మహా మంగళహారతి, అన్నదాన కార్యక్రమం ఏర్పాటు చేసినట్లు తెలిపారు. సాయంత్రం గ్రామోత్సవం ఉంటుందని వివరించారు. పెద్ద సంఖ్యలో భక్తులు పాల్గొని స్వామిని దర్శించుకుని తీర్థ ప్రసాదాలు స్వీకరించాలని కోరారు.

రేపు క్యాంపస్ ప్లేస్‌మెంట్ డ్రైవ్

బద్వేలు అర్బన్ : హెటిరో ల్యాబ్స్ లిమిటెడ్ హైదరాబాద్ వారి ఆధ్వర్యంలో స్థానిక రాచపూడి నాగభూషణం డిగ్రీ, పీజీ కళాశాలలో బుధవారం క్యాంపస్ ప్లేస్‌మెంట్ డ్రైవ్ నిర్వహించనున్నట్లు కళాశాల ఏఓ, మున్సిపల్ వైస్‌చైర్మన్ సాయిక్రిష్ణ, ప్రిన్సిపల్ సత్యనారాయణలు తెలిపారు. జూనియర్ ఆఫీసర్, ట్రైనీ, జూనియర్ కెమిస్ట్, ఆపరేటర్ వంటి ఉద్యోగాలకు నిర్వహిస్తున్న ఈ క్యాంపస్ డ్రైవ్‌లో పాల్గొనే అభ్యర్థులు బీఎస్సీ-కెమిస్ట్రీ, ఎమ్మెస్సీ-కెమిస్ట్రీ, బి.ఫార్మసీ, బీకాం పూర్తి చేసిన వారు అర్హులన్నారు.

పథకాలను పునరుద్ధరించాలి



డీఆర్వో గంగాధర్‌గౌడ్‌కు వినతిపత్రమిస్తున్న బీజేపీ కిసాన్ మోర్చా నాయకులు

కడప కోటిరెడ్డిసర్కిల్ : రాష్ట్రంలో మూడేళ్లుగా అమలుకాని 26 పథకాలను వెంటనే పునరుద్ధరించాలని బీజేపీ కిసాన్ మోర్చా రాష్ట్ర అధ్యక్షుడు వంగల శశిభూషణ్‌రెడ్డి కోరారు. సోమవారం కలెక్టరేట్‌లో జరిగిన స్పందన కార్యక్రమంలో భారతీయ జనతా పార్టీ ఎస్సీ మోర్చా నేతలు డీఆర్వో గంగాధర్‌గౌడ్‌కు వినతిపత్రమిచ్చారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రాష్ట్రంలోని అన్ని జిల్లాల్లో 10 లక్షల మంది ఎస్సీ యువత నిరుద్యోగంతో కొట్టుమిట్టాడుతున్నారన్నారు. చదువుకున్న యువత నైపుణ్యం వృథా అవుతోందని, యువతకు ఉద్యోగాలు లేక తల్లిదండ్రులు కూలీలుగానే బతుకులు వెళ్లదీస్తున్నారన్నారు. ఇప్పటికైనా రాష్ట్ర ప్రభుత్వం నిరుద్యోగ యువతకు ఉద్యోగాలు కల్పించాలని కోరుతున్నామన్నారు. బీజేపీ రాష్ట్ర నాయకులు మాదినేని రామసుబ్బయ్య, లక్ష్మిదేవి, వీరప్రతాప్‌రెడ్డి, నాయకులు లక్ష్మణ్‌రావు, నాగరాజ, జిల్లా అధ్యక్షులు డి.వెంకటేశ్వర్లు, అనంత కేశవరావు పాల్గొన్నారు.

సమస్యల పరిష్కారంలో సంఘాలది ప్రముఖపాత్ర

– వైవీయూ రిజిస్ట్రార్ వై.పి. వెంకటసుబ్బయ్య



డైరీని ఆవిష్కరిస్తున్న రిజిస్ట్రార్ వెంకటసుబ్బయ్య

వైవీయూ: అధ్యాపకుల సమస్యల పరిష్కారంలో అధ్యాపక సంఘాల పాత్ర ఎంతో కీలకమైనదని వైవీయూ రిజిస్ట్రార్ ఆచార్య వై.పి. వెంకటసుబ్బయ్య పేర్కొన్నారు. సోమవారం ప్రభుత్వ కళాశాలల అధ్యాపకుల సంఘం (జీసీటీఏ) ఆధ్వర్యంలో వైవీయూలో నూతన డైరీ ఆవిష్కరణ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా రిజిస్ట్రార్ మాట్లాడుతూ విద్యార్థులు విద్య, ఉద్యోగ అవకాశాలు పొందడంలో అధ్యాపకులు కీలకపాత్ర పోషించాలని సూచించారు. అనంతరం ఆర్ట్స్ కళాశాలలో అధ్యాపకులకు డైరీలను అందజేశారు. ప్రిన్సిపాల్ డా. జి. రవీంద్రనాథ్ , జీసీటీఏ జిల్లా అధ్యక్షుడు డా. శశికాంత్‌రెడ్డి, ప్రధాన కార్యదర్శి డా. ఆర్. నీలయ్య, జోనల్ అధ్యక్షుడు డా. కృష్ణారెడ్డి, ఆర్థిక కార్యదర్శి డా. రామకృష్ణ, తదితరులు పాల్గొన్నారు.

సాధన ద్వారానే అభ్యసన మెరుగు

ఎంఈఓ పాలెం నారాయణ



పాఠశాలలో రికార్డులను పరిశీలిస్తున్న ఎంఈఓ పాలెం నారాయణ

కడప ఎడ్యుకేషన్: ప్రతి విద్యార్థి ప్రాథమిక దశ నుంచే సాధన అలవాటు చేసుకుంటే అభ్యసన మెరుగుపడుతుందని ఆ దిశగా ఉపాధ్యాయులు కృషి చేయాలని ఎంఈఓ పాలెం నారాయణ సూచించారు. సోమవారం కడపలోని కసాయివీధి, ఆమీన్‌పీర్ రోడ్డులోని 11, 12వ వార్డు పాఠశాలలను ఆయన సందర్శించి ఉపాధ్యాయులకు, విద్యార్థులకు పలు సూచనలు, సలహాలను ఇచ్చారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సాధన ద్వారానే అభ్యసన మెరుగుపడుతుందన్నారు. మొదట మాతృభాషపైన పట్టు సాధించగలిగితే ఆంగ్లభాష అభ్యసన, గణితం, సైన్సు పట్ల పూర్తిస్థాయి అవగాహన అవుతుందన్నారు. ప్రతి పాఠశాలలో ఉపాధ్యాయులు విద్యార్థి అభ్యసనా స్థాయిని తెలుసుకుని వారికి తగిన రీతిలో బోధించాల్సిన బాధ్యత ఉపాధ్యాయులదేనన్నారు. పాఠశాల ప్రధానోపాధ్యాయులు పాఠశాలకు సంబంధించిన అన్ని రికార్డులను సరైన రీతిలో నమోదు చేయాలని తెలిపారు. అనంతరం నాడు- నేడు పనులతోపాటు మధ్యాహ్న భోజనాన్ని పరిశీలించారు. ఈ కార్యక్రమంలో సీఆర్‌పీ ఆదిమూలం శంకర్, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

హంస వాహనంపై శ్రీరంగనాథుడు



హంస వాహనంపై శ్రీరంగనాథుడు

పులివెందుల టౌన్ : పులివెందుల పట్టణంలో పూలంగళ్ల సర్కిల్ వద్ద ఉన్న శ్రీరంగనాథుని కాంప్లెక్స్‌లో ప్రాచీన దేవాలయమైన శ్రీరంగ నాథ స్వామి ఆలయ బ్రహ్మోత్సవాలు అత్యంత వైభవంగా జరుగుతున్నాయి. అందులో భాగంగా 9వరోజు సోమవారం రాత్రి శ్రీరంగనాథ స్వామి హంసవాహనంపై భక్తులకు దర్శనమిచ్చారు. శ్రీరంగనాథ స్వామిని ప్రత్యేకంగా అలంకరించి పురవీధుల గుండా ఊరేగించారు. స్వామి వారికి భక్తులు కాయ కర్పూరాలు సమర్పించి ప్రత్యేక పూజలు చేశారు. సోమవారం నాటితో శ్రీరంగనాథస్వామి బ్రహ్మోత్సవాలు ముగిశాయి. కార్యక్రమంలో ఆలయ కమిటీ చైర్మన్ సుధీకర్‌రెడ్డి, ఈఓ కెవి రమణలు, సభ్యులు పాల్గొన్నారు.

ఉచిత డ్రైవింగ్ శిక్షణ

కమలాపురం: హైదరాబాద్‌కు చెందిన అభయ ఫౌండేషన్ ఆధ్వర్యంలో కమలాపురం యువతకు ఉచితంగా డ్రైవింగ్‌లో శిక్షణ ఇస్తున్నట్లు మదర్ థెరిసా సేవా సమితి ఛారిటబుల్ ట్రస్ట్ అధ్యక్షుడు జూటూరు విజయ్ కుమార్ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. కమలాపురం పట్టణానికి చెందిన శ్రీ లక్ష్మీదుర్గ టెక్నికల్ డ్రైవింగ్ స్కూల్‌లో 20 రోజులు డ్రైవింగ్‌లో శిక్షణతో పాటు మరో 10రోజుల థియరీ క్లాసులు చెబుతారని ఆయన అందులో పేర్కొన్నారు. అనంతరం ఎల్ఎల్ఆర్ లైసెన్స్, సర్టిఫికెట్స్ ఇప్పిస్తామన్నారు. 19-35 సంవత్సరాల్లోపు ఉన్న యువకులు అర్హులన్నారు. ఆసక్తి కలిగిన యువకులు ఆధార్, రేషన్ కార్డు, మార్కులిస్ట్, 4 పాస్‌పోర్ట్ సైజు ఫోటోలతో దరఖాస్తు చేసుకోవాలన్నారు. రిజిస్ట్రేషన్ ఫీజు రూ.500 అభయ ఫౌండేషన్ పేరిట చెల్లించి రిజిస్ట్రేషన్ చేయించుకోవాలని, శిక్షణ అనంతరం రూ.500 తిరిగి చెల్లిస్తారని ఆయన అన్నారు.

రేపు వైద్య శిబిరం

చెన్నూరు : ఈనెల 15వ తేదీ కొండపేటలో ఉచిత కంటి వైద్య శిబిరాన్ని నిర్వహిస్తున్నట్లు స్థానిక ప్రముఖులు సుధాకర్‌రెడ్డి తెలిపారు. సోమవారం ఆయన చెన్నూరులో విలేకరులతో మాట్లాడారు. దివంగత పెడబల్లి సుబ్బారెడ్డి, పెడబల్లె శివారెడ్డిల సంస్మరణగా వారి కుటుంబ సభ్యుల ఆధ్వర్యంలో పుష్పగిరి కంటి ఆస్పత్రి ఆధ్వర్యంలో ఈ శిబిరం నిర్వహిస్తున్నామన్నారు.

లోకేష్ యాత్రతో పడిపోయిన టీడీపీ గ్రాఫ్

వైఎస్సార్‌సీపీ రాష్ట్ర కార్యదర్శి అఫ్జల్‌ఖాన్ ఎద్దేవా



మాట్లాడుతున్న అఫ్జల్‌ఖాన్

కడప కార్పొరేషన్: ప్రతిపక్షనేత చంద్రబాబు సుపుత్రుడు నారా లోకేష్ పాదయాత్రతో టీడీపీ గ్రాఫ్ శాశ్వతంగా పడిపోయిందని వైఎస్సార్‌సీపీ రాష్ట్ర కార్యదర్శి అఫ్జల్‌ఖాన్ అన్నారు. సోమవారం వైఎస్సార్‌సీపీ జిల్లా కార్యాలయంలో ఆయన విలేకరులతో మాట్లాడారు. రాష్ట్రంలో దళిత, బడుగు, బలహీన, మైనార్టీ వర్గాల సంక్షేమం, అభివృద్ధికి ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి కృషి చేస్తున్నారన్నారు. గత ప్రభుత్వాలు ఆర్థికంగా, సామాజికంగా అభివృద్ధి చెందిన వారికే పెద్దపీట వేశాయని, వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అధికారంలోకి వచ్చిన నాటి నుంచి గుర్తింపు లేని ఎన్నో సామాజిక వర్గాలను వెలికి తీసి ప్రాధాన్యత కల్పించారన్నారు. ఇలాంటి గొప్ప నాయకునికి గూర్చి లోకేష్ మాట్లాడుతున్న మాటలు చూసి ప్రజలు అసహ్యించుకుంటున్నారన్నారు. ముఖ్యమంత్రి కుటుంబంపై బురదజల్లడానికే జగనాసుర రక్త చరిత్ర పుస్తకం విడుదల చేశారని అఫ్జల్‌ఖాన్ మండిపడ్డారు.

పగిలిపోయిన పైపులైన్



పైపులైన్ లీకేజీ వల్ల దెబ్బతిన్న సిమెంటు రోడ్డు

కడప కార్పొరేషన్: కడప నగరంలోని రామాంజనేయ పురంలో సాయి శ్రీనివాస గార్డెన్ ఎదురుగా పీఎఫ్ క్వార్టర్స్‌కు పోయే మార్గంలో రోడ్డు పక్కనే ఉన్న ప్రధాన పైపులైన్ పగిలిపోయింది. దీనికి తోడు ఇటువైపుగా టిప్పర్లు మట్టి తోలుతుండటంతో సిమెంటు రోడ్డు కూడా బద్దలుగా పగిలిపోయింది. పైపులైన్ లీకేజీని అరికట్టి, రోడ్డును బాగు చేయాలని స్థానికులు కోరుతున్నారు.